ప్రజాశక్తి

గురువారం 17 ఏప్రిల్ 2025

5

అల్లూరి సీతారామరాజు

పిడుగు పడి ఆరు మేకలు మృతి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీ ఎం.బొడ్డాపుట్టు గ్రామంలో బుధవారం కురిసిన భారీ వర్షంలో పిడుగు పడి 6 మేకలు మృతి చెందాయి. ఈ ఘటన మండలములోని మఠం పంచాయతీ ఎం.బోడపుట్టు గ్రామంలో చోటు చేసుకుంది. రైతుల చెప్పిన వివరాల ప్రకారంగా బుధవారం గ్రామ సమీపంలో పశువులు మేకలు నేతకు తీసుకెళ్లారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు భారీ ఈదురు గాలులతో ఉరుములు మెరుపులతో వర్షం కురవడంతో పిడుగుపాటుకు గురై 6 మేకలు మృతి చెందాయి. మేకలంతా మృతి చెంది ఉండడంతో రైతు పాంగి స్వామి కన్నీరుగా విలపించాడు.అధికారులు గుర్తించి మృతి చెందిన మేకలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన కోరారు.

మృతి చెందిన మేకలు

జెడ్‌పి నిధులపై ఎమ్మెల్యేల పెత్తనమా?

-చైర్‌పర్సన్ పోడియాన్ని చుట్టుముట్టిన జెడ్‌పిటిసిలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జెడ్‌పిటిసి నిధులపై ఎమ్మెల్యేల పెత్తనం సరికాదని పలువురు జెడ్‌పిటిసిలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ముందుగా అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణాసంచా ప్రమాద ఘటనపై సమావేశం కాసేపు మౌనం పాటించింది. సభకు అధ్యక్షత వహించిన జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వైద్య ఆరోగ్య, విద్యా, పంచాయతీరాజ్, రూరల్ వాటర్ సప్లై, ఇరిగేషన్, రోడ్లు, భవనాలు తదితర శాఖల అంశాలపై చర్చ జరిగింది. జిల్లా పరిషత్‌కు సంబంధించి చేపడుతున్న అభివృద్ధి పనులపై సలహాలు, సూచనలు ఇవ్వాలని సభ్యులను జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర కోరారు. దీనిపై మునగపాక జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ, జెడ్‌పిటిసి సభ్యునిగా తనకు మంజూరైన నిధులను వివిధ అభివృద్ధి పనులకు కేటాయించి, వాటిని చేయాలని అధికారులను లిఖిత పూర్వకంగా కోరుతున్నా జరగటం లేదన్నారు. పనులు ఎందుకు జరగడంలేదని ప్రశ్నిస్తే యలమంచిలి ఎమ్మెల్యే చెబితే తప్ప తాము పనులు చేసేది లేదని అధికారులు అంటున్నారని వివరించారు. జెడ్‌పి నిధులపై ఎమ్మెల్యేల జోక్యం దేనికని ప్రశ్నించారు. ఈ సమస్యను అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరవాడ జెడ్‌పిటిసి పైలా సన్యాసిరాజు, మరి కొంతమంది వైసిపి జెడ్‌పిటిసిలు ఇదే సమస్యపై మాట్లాడుతూ, తమకు కూడా ఇటువంటి చేదు అనుభవాలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని, అభివృద్ధి పనులు జరిగేలా చూడాలని చైర్‌పర్సన్‌ను డిమాండ్ చేస్తూ, పోడియాన్ని చుట్టుముట్టి నిరసన తెలిపారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని, ఇటువంటి సమస్య లేకుండా చూస్తామని చెప్పడంతో వారు శాంతించారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో డ్రగ్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించాలని చైర్‌పర్సన్ సుభద్ర ఆదేశించారు. జిల్లాలో ప్రమాదాలు జరిగిన అనంతరం చేపడుతున్న తక్షణ సహాయ కార్యక్రమాల కంటే ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చేపడుతున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అచ్యుతాపురం జెడ్‌పిటిసి లాలం రాంబాబు, మునగపాక జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ, అనకాపల్లి నుంచి అచ్చుతాపురం వరకు ఉన్న రోడ్డును విఎంఆర్‌డిఎ ఆధ్వర్యాన 100 అడుగుల వెడల్పుతో విస్తరించే కార్యక్రమాన్ని చేపడుతున్నారని, ఈ విస్తరణలో గృహాలు, షాపులు, భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారంగా నగదు బదులు టిడిఆర్‌లు ఇవ్వడం సరికాదన్నారు. దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. నష్టపరిహారాన్ని చెక్కుల రూపంలో బ్యాంకులలో జమ చేయాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సమావేశంలో పాల్గొన్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణ తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో నాడు-నేడు పథకంలో అనేక ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే పనులు చేపట్టారని, ప్రభుత్వం మారడంతో కొన్ని నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేయాలని పలువురు జెడ్‌పిటిసిలు కోరారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, చోడవరం ఎమ్మెల్యే కెఎస్‌ఎన్‌ఎస్.రాజు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించారు. అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు, ఉన్న ఇబ్బందులు ఏమిటి అని ప్రశ్నించారు. అధికారులు ఇచ్చిన వివరణ అనంతరం వారు మాట్లాడుతూ, జెడ్‌పి, పంచాయతీరాజ్, ఎన్ఆర్ఇజిఎస్ వంటి శాఖల ఆధ్వర్యాన సమావేశాన్ని దీనిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, తగు చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. మునగపాక మండలంలో కొన్ని పాఠశాలల భవనాలు అసంపూర్తిగా ఉన్న విషయాన్ని జెడ్‌పిటిసి స్వామి సత్యనారాయణ సభ దృష్టికి తీసుకొచ్చారు. అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రి, మార్చురీ వద్ద అక్రమంగా డబ్బు వసూలు చేస్తున్నారని, దీనిని అరికట్టాలని ఆయన ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను ప్రత్యేక కవర్‌తో కప్పేలా ఏర్పాటుచేయాలని కోరారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, ఫార్మా కంపెనీలలో, ఇతర ప్రమాదాలలో మరణించిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఒకే రకమైన ఎక్స్‌గ్రేషియాను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం తీర్మానించేందుకు చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ తెలిపారు. ఈ సమావేశంలో అరకు పార్లమెంటు సభ్యులు గుమ్మా తనూజారాణి, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎఎస్ఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, రేగం మత్స్యలింగం, కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి.కుమార్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, జిల్లా పరిషత్ సిఇఒ నారాయణమూర్తి, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోడియంను చుట్టుముట్టిన జెడ్‌పిటిసిలు

మాట్లాడుతున్న అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

ఏజెన్సీ ప్రజల సమస్యలను ప్రస్తావించిన గంగరాజు

ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ఏజెన్సీలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను లేవనెత్తారు. వైద్య ఆరోగ్య శాఖపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు, అనంతగిరి మండలాల నుంచి వివిధ ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రులను, వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగులను, విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స కోసం ముందుగా తరలిస్తున్నారని తెలిపారు. అత్యవసర కేసులు ఉంటే కెజిహెచ్‌కు రిఫర్ చేయకుండా విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించడం వలన సరైన వైద్యం అందక రోగులు మరణిస్తున్నారని తెలిపారు. విశాఖ కెజిహెచ్‌లో సరైన వైద్యం అందుతుందని, దీనిపై అల్లూరి జిల్లా కలెక్టర్ దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించి, 108 అంబులెన్స్‌లో కెజిహెచ్‌కు పంపేలా అనుమతులు కోసం కృషిచేయాలని కోరారు.

అల్లూరి జిల్లా ఏజెన్సీ పిహెచ్‌సిల్లో పనిచేస్తున్న అంబులెన్స్ డ్రైవర్లకు ఎన్‌హెచ్‌ఎం సంస్థ ద్వారా రూ.15 వేలు ఇస్తున్నారని, ప్రస్తుతం పెరిగిన ధరలతో పోల్చితే ఈ వేతనం ఏమాత్రమూ సరిపోదని, వీరందరిని ఐటిడిఎలో కలిపి జీతాలు పెంచాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. అదనపు డ్రైవర్లు నియమించాలని తీర్మానం చేయాలని కోరారు. సిహెచ్‌డబ్ల్యుఒలను ఆశాలుగా ప్రమోట్ చేయాలపి. ఏజెన్సీ పిహెచ్‌సి కేంద్రాల వైద్యులకు ఏజెన్సీ అలవెన్స్ ఇవ్వాలని కోరారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా 11 మండలాల్లో 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, చింతపల్లిలో 696 మంది, సీలేరులో 294 మంది, బాకురులో 214 మంది, బలరాంలో 131 మంది, జోలాపుట్‌లో 239 మంది, పెదబయలులో 391 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి వసతి గృహాలు లేనందున చదువుకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. పాఠశాలల్లో బెంచీలు, బాత్రూమ్స్ లేవని, కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా పరిషత్ పాఠశాలల్లోనే హాస్టల్స్ ఏర్పాటుచేసేలా జిల్లా పరిషత్ సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

విద్యార్థులకు మెనూ సక్రమంగా అందించాలి : ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ప్రభుత్వ వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మెనూ సక్రమంగా అందజేయాలని, వారి ఆరోగ్య, యోగక్షేమాలు నిరంతరం పర్యవేక్షించాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. మండలంలోని అమీనాబాద్ గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల రిజిస్టర్లు, స్టాక్ రూము, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమకు తెలియజేయాలని కోరారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల, వసతిగృహ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీ

మండలంలోని రాజవొమ్మంగి 1, 2, దూసరపాము, అమీనాబాద్, జడ్డంగి తదితర గ్రామ సచివాలయాలను ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. సచివాలయాల్లో అందుబాటు లేని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సచివాలయ సేవలు ప్రజలకు పారదర్శకంగా అందించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమం తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు మఠం విజయభాస్కర్, ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, సర్పంచ్ గొల్లపూడి రమణి, టిడిపి మండల అధ్యక్షులు జి.పెద్దరాజు, రాజవొమ్మంగి సిఐ ఎన్.సన్యాసినాయుడు, జడ్డంగి ఎస్ఐ చిన్నబాబు, బడదనంపల్లి సర్పంచ్ గొల్లపూడి లక్ష్మీదుర్గ, ఎంపిటిసి సత్తిబాబు, టిడిపి, జనసేన కూటమి నాయకులు గణజాల తాతారావ్, గంగాధర్. బి.అనుదీప్, సిహెచ్.పండుబాబు, ఎం.శ్రీను, పి.సత్తిబాబు, సిహెచ్.సుబ్బారావు, వెంకటరమణ, మరిడయ్య, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుందులూరు సర్పంచ్ జయకు వినతి పత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

పాఠశాలల కుదింపును ఆపాలని యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-విఆర్.పురం

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో సంస్కరణల్లో భాగంగా చేపడుతున్న పాఠశాలల కుదింపు ప్రక్రియను ఆపాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) నాయకులు బుధవారం మండలంలోని కుందులూరు పంచాయితీ సర్పంచ్ బంధం జయకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి యన్.జగదీష్, నాయకులు యన్.ప్రసాద్, యం.వీరయ్య మాట్లాడుతూ మోడల్ ప్రైమరీ స్కూల్‌గా ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెబుతుందని, కానీ పంచాయితీల్లో ఉన్న పాఠశాల నుండి 3, 4, 5 తరగతులను మోడల్ ప్రైమరీ స్కూళ్లకు తరలించడం వల్ల వారు దూరంగా ఉన్న పాఠశాలకు వెళ్ళ లేక డ్రాపౌట్ అయ్యే పరిస్థితి ఉంటుందని, విద్యకు దూరమవుతారని తెలిపారు. యుపి స్కూళ్లలో 6, 7, 8 తరగతులు సమీప పాఠశాలకు తరలించేందుకు ప్రభుత్వం యోచిస్తుందని, దీని వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతారని చెప్పారు. అందువల్ల ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రతి గ్రామంలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. 1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులను నియమించి ప్రాథమిక పాఠశాలలను యథవిధిగా కొనసాగించాలని కోరారు. 6, 7, 8 తరతులలో 60 మంది విద్యార్థులు దాటి ఉంటే ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసి స్కూల్ అసిస్టెంట్లను నియమించాలి కోరారు. ఈ కార్యమంలో యూటీఎఫ్ మండల కార్యదర్శులు యన్.జగదీష్, ఎం.వీరయ్య, యన్ ప్రసాద్ పాల్గొన్నారు.

అన్ని ఇళ్ల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేయాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ప్రతి ఇంటి వద్ద తప్పనిసరిగా మలేరియా దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, లోదొడ్డి సర్పంచ్ లోతా రామారావు అన్నారు. మండలంలోని జడ్డంగి పిహెచ్సి పరిధిలోని కూడేడు గ్రామంలో సర్పంచ్ లోతా రామారావు పర్యవేక్షణలో వైద్య సిబ్బంది మలేరియా దోమల నివారణ మందు పిచికారి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామారావు మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు చాలా ప్రమాదకరమైనవని, దోమల బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఇంట్లో తప్పనిసరిగా దోమల నివారణ మందు స్ప్రే చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి ప్రజల సహకరించాలని కోరారు.మ గ్రామంలో 84 ఇళ్లకు స్ప్రేయింగ్ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి సిహెచ్ ప్రసాదు, సిడిపిఓ దేవామణి, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారి కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ లోతా రామారావు

మాట్లాడుతున్న అప్పలనర్స

ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మెగా డీఎస్సీ తో పాటు ఆదివాసి స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాచిపెంట అప్పలనర్స డిమాండ్ చేశారు. అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘం భవనంలో బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఐదోవ షెడ్యూల్ ఏరియాలో డిగ్రీ , బీటెక్, ఎంటెక్, బీఈడీ, పీజీ చదివిన ఆదివాసి గిరిజన యువతి, యువకులకు ఉపాధి లేక నిరుద్యోగులుగా వేలాది మంది ఉన్నారని చెప్పారు. ఆదివాసి గిరిజన స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేయడం చేశారు. ఆదివాసి ప్రాంతంలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం భర్తీ చేయలేదన్నారు. గిరిజన ప్రాంతంలో సహజ సంపదను కొల్లగొట్టడానికి కూటమి ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తుందన్నారు.అధికారంలోకి రాకముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరకులో నిర్వహించిన ప్రచార సభలో లక్షలాది మంది ప్రజల ముందు జివో 3 పునరుద్ధరణ చేసి ఈ ప్రాంతంలో ఉన్న యువతి యువకులకు 100శాతం ఉపాధి కల్పిస్తామని వాగ్దానం చేశారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో 3 చట్టబద్ధత కోసం, గిరిజన స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విషయంలో ఎటువంటి చొరవ తీసుకోకుండా ఆదివాసి గిరిజన యువతి, యువకులకు తీవ్రంగా మోసం చేశారన్నారు.ఆదివాసి స్పెషల్ డిఎస్సి ప్రకటన చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పొద్దు బలదేవ్, జన్ని భగత్ రామ్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు

ప్రజాశక్తి-చింతపల్లి: ఎక్కడపడితే అక్కడ చెత్తను వేస్తే ఉపేక్షించేది లేదని చింతపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తున్నామని సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. ముత్యాలమ్మ జాతరతో గ్రామ పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించామని ఆమె పేర్కొన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్తను పారవేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్తకుండీలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు.

సమ్మర్ శిక్షణా శిబిరాల నిర్వహణకు ఆహ్వానం

ప్రజాశక్తి పాడేరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఆదేశాల మేరకు మే ఒకటవ తేదీ నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా 50 సమ్మర్ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ప్రాధికార సంస్థ అధికారి ఎ. జగన్మోహన రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిది నుండి 14 ఏళ్ళ వయసు గల బాల బాలికలకు వివిధ క్రీడాంశాలలో శిక్షణ తరగతులు నిర్వహించడానికి జిల్లాలోని క్రీడా సంఘాల ప్రతినిధులు, స్కూల్ గేమ్స్ కార్యదర్శుల నుండి ప్రతిపాదనలు శాప్ ఆమోదం కొరకు కోరియున్నారని ఆ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడా సంఘాల ప్రతినిధులు, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు ఈ నెల 17వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి అధ్యక్షతన కార్యాలయంలో జరుగు సమావేశానికి హాజరు కావాలాని ఆయన కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

వచ్చే విద్యా సంవత్సరం నుండి అన్ని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఏజెన్సీ డీఈవో, ఎంఇఒలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారి, పియంయు అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలోనూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా క్వాలిటీ విద్యను అందించే విధంగా, నూటికి నూరు శాతం సీట్లు పూర్తిగా నింపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి పైనా దృష్టి పెట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఏజెన్సీలోని ప్రతి అంగన్వాడి కేంద్రంలో నూటికి నూరు శాతం ఎన్రోల్మెంట్ ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. జెడ్పీ పాఠశాలలలో విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్, గురుకుల పాఠశాలల్లో అన్ని సీట్లు నింపడానికి కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు సెలవుల నుండి తిరిగి వచ్చిన వెంటనే అన్ని తరగతులకు బేస్ లైన్ టెస్టులు నిర్వహించాలన్నారు. జూన్ 25 నాటికి విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేయాలన్నారు. ఇంటర్మీడియట్ పాస్ అయిన గిరిజన విద్యార్థులకు మెడికల్ సీట్లు, ఇంజనీరింగ్ సీట్లు పొందే విధంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ వేసవి సెలవుల్లో టీచర్లకు నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకునే విధంగా ప్రత్యేక ప్రోగ్రాం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారి కృష్ణమోహన్, ఎంఇఒ యం.సత్యనారాయణ, రామకృష్ణ, బాపన్నదొర, సూరారెడ్డి, ముత్యాలరావు, వై.వెంకన్న, పి.శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ బి.కిషోర్. గురుకులం సెల్ అధికారి నాగేంద్ర, పీఎంయు అధికారి చంద్రకళ, ఈఆర్ఎంఎస్ ప్రిన్సిపాళ్లు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, గిరిజన ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

అధికారులు ప్రోటోకాల్ పాటించాలి

ఎమ్మెల్సీ అనంతబాబు

ప్రజాశక్తి-గంగవరం : అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో ప్రజల చేత ఎన్నిక కాబడిన ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యత ఇవ్వాలని, కచ్చితంగా ప్రోటోకాల్ పాటించాలని వైసిపికి చెందిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అన్నారు. ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగితే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అనంతబాబు పాల్గొని మాట్లాడారు. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల పరిషత్ సమావేశాలకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో సర్పంచులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మండల పరిషత్ సమావేశాలకు హాజరు కానీ ప్రభుత్వ శాఖల అధికారులపై జిల్లా కలెక్టర్‌కు నోట్ పెట్టాలని ఎంపీడీవోను ఎమ్మెల్సీ ఆదేశించారు. గ్రామపంచాయతీ స్థాయిలో అభివృద్ధి మౌలిక సౌకర్యాల సమస్యల పరిష్కారానికి మండల పరిషత్ సమావేశాలు దోహదపడతాయని చెప్పారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. విద్య, ఉపాధి హామీ, వ్యవసాయం, పశుసంవర్ధక, గృహ నిర్మాణ, వెలుగు, ఐసిడిఎస్ శాఖలు వారీగా చేపట్టిన కార్యక్రమాలు వివరించారు. ఉపాధి ఏపీవో ప్రకాష్ మాట్లాడుతూ గ్రామ సభలు తీర్మానం పొందిన తర్వాతే ఉపాధి హామీ పనులను మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. మండలంలో ఆముదాల బంధ, దొరమామిడి, ఎండపల్లి పంచాయతీ భవనాలు నిర్మాణానికి ప్రతిపాదన చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సర్పంచులకు తగిన గౌరవం ఇవ్వడం లేదని పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పిటిసి బేబీ రత్నం, వైస్ ఎంపీపీలు రామతులసి, గంగాదేవి, కో-ఆప్షన్ సభ్యుడు ప్రభాకర్‌రావు, ఎంపీటీసీ సభ్యులు పండా ఆదినారాయణ, వెంకటలక్ష్మి, కనకలక్ష్మి, పద్మావతి, తహశీల్దారు శ్రీనివాసరావు, ఎంపీడీవో లక్ష్మణరావు, ఐసిడిఎస్ సిడిపిఓ సిహెచ్.లక్ష్మి, ఏవో విశ్వనాథ్, ఏటీఎం షణ్ముఖరావు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్తు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్

బాధితుడికి పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ పెదపాడు గ్రామంలో కొర్ర మారుతీ రావు అనే గిరిజనుడికి చెందిన దుక్కి పశువులు పిడుగుపాటుకు గురై మృతి చెందాయని, బాధిత గిరిజనుడికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గిరిజనులు దుక్కి పశువుల మీద ఆధారపడి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పిడుగుల వర్షానికి మృతి చెందడంతో ఆర్థికంగా నష్టపోయారని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

వికలాంగులకు వైద్య శిబిరం

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు:- మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం దివ్యాంగుల వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని మండల ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి తెలిపారు. ముంచింగి పుట్టు మండలం నుండి 120 మంది, పెదబయలు మండలం నుండి 52 మంది దివ్యాంగులు వారికి అవసరమగు పరికరముల కొరకు నమోదు చేసుకున్నారు. వారికి త్వరలోనే ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 450 మంది హాజరయ్యారని, వారికి భోజన సౌకర్యం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించామని తెలిపారు.

నాట్లు వేస్తున్న రైతులు

వేరుశనగ సాగులో గిరిజనులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ బూరువలస గ్రామంలో రైతులు వేరు శెనగ నాట్లులో నిమగ్నం అయ్యారు. గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో వ్యవసాయ పనులకు సులువైంది. రైతులు వేరుశెనగలు తదితర పంటలు సాగు పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. గత నెలలో వర్షాలు లేక వ్యవసాయ పనులకు జరగలేదు. ఏప్రిల్ నెల నుంచి వర్షాలు పడడంతో రైతులు దుక్కి దున్నేసి వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. సకాలంలో వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందని సెల్ సిగ్నల్స్

సెల్ టవర్

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని వేంగడ పంచాయతీ హెడ్ క్వార్టర్ లో సెల్ సిగ్నల్ సేవలు అందక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మండలంలోని అడుగడుగున జియో సెల్ టవర్లు ఏర్పాటులో భాగంగా వేంగడ గ్రామంలో టవర్ ఏర్పాటు చేసి సుమారు ఒక సంవత్సరం కావస్తున్న నేటికీ సిగ్నల్ అందుబాటులోకి రాలేదని వాపోయారు.అంగన్వాడి. సబ్ సెంటర్, జీసీసి, డీలర్ డిపో సిబ్బంది ఆన్లైన్ చేసేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.కలెక్టర్, పీఓలకు కలిసి పలుమార్లు విన్నవించినా నేటికీ సిగ్నల్ అందుబాటులోకి రాలేదని వేంగడ మాజీ సివిల్ ..కొండలరావు ఆరోపించారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండలరావు

ప్రజాశక్తి అరకులోయ రూరల్: రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం అరకులోయలో ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయంలో యూనియన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి కొండలరావు మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన బోర్డును గత ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు కాకుండా నిలిపివేసిందని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తక్షణం బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఇతర రాష్ట్రాల్లో అనేక సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా కార్మికులు ఎటువంటి సంక్షేమానికి నోచుకోలేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని కూటమి నేతలు మేనిఫెస్టోలో పెట్టారని తెలిపారు. పది నెలలు కావస్తున్నా హామీ నెరవేర్చలేదన్నారు. గత ప్రభుత్వం 1214 మెమో తీసుకొచ్చి కార్మికులకు నష్టం చేకూర్చిందని తక్షణం మెమోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని ఈనెల 24వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అరకువేలి మండల కార్యదర్శి జె.భగత్ రాం, యూనియన్ నాయకులు స్వామి నాయుడు, శ్రీను, రవి, దాసు రాజేంద్ర, దొరబాబు, సత్తిబాబు, కార్పెంటర్స్, ఎలక్ట్రికల్ వర్కర్స్, సెంట్రింగ్, రాడ్ బెండింగ్ కార్మికులు, పెయింటర్స్, మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యారంగంలో నష్టాలను అరికట్టాలని యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలతో విద్యారంగంలో నష్టాలను అరికట్టుటకు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డుంబ్రిగూడ మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు, కండ్రుం పంచాయతీ సర్పంచ్ కిముడు హరికి స్థానిక మండల యూటీఎఫ్ అధ్యక్షుడు యస్ బాలకృష్ణ వినతి పత్రం అందజేశారు. జడ్జిపొలం గ్రామ పంచాయతీలో విద్యార్థుల సంఖ్య 60 కు మించి ఉంటే పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్ గా ఏర్పాటు చేసి తరగతికి ఒక టీచర్ కేటాయిస్తామని ఉత్తర్వులు పేర్కొన్నారనారు. తల్లిదండ్రులు కోరితే 45 మంది విద్యార్థులు ఉన్నచోట కూడా మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారని, కానీ ఆదే పంచాయతీలో ఉన్న పాఠశాల నుండి 3,4,5 తరగతులను తరలించి మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయడంతో విద్యార్థులు దూరంగా ఉన్న పాఠశాలకు వెళ్ల లేక డ్రాపౌట్ అయ్యి విద్యకు దూరమయ్యే పరిస్థితి వస్తుందని తెలియ చెప్పారు. యాలి స్కూల్ లో 6,7,8 తరగతులు సమీప పాఠశాలకు తరలించేందుకు ప్రభుత్వం యోచిస్తుందన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురి అవుతారని చెప్పారు.ప్రతి గ్రామంలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ కార్య ధర్శులు యస్ నిరంజన్ ,తులసి దాస్ సిబ్బంది పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

మనసంతా పరిశ్రమాధిపతులపైనే..!

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, రాంబిల్లి విలేకరి

జిల్లాలో కొత్త పరిశ్రమలు వచ్చిందీలేదు, వచ్చిన కంపెనీల్లో స్థానిక యువతకు ఉపాధి కల్పించిందీ లేదుగాని తలదాచుకున్న నీడను కూడా పేదలకు ప్రభుత్వం లేకుండా చేస్తోంది. ప్రజా ప్రయోజనాల పేరుతో భూములు సేకరించి పరిశ్రమాధిపతులకు కేటాయిస్తోంది. వారికి కల్పించే సౌకర్యాలు, సదుపాయాల్లో సామాన్యుల బతుకులను దెబ్బతీస్తోంది. భూమి లిచ్చి జీవనోపాధి పోగొట్టుకున్నామన్న బాధ వెంటాడుతుండగానే, రోడ్డు విస్తరణ ప్రతిపాదనలతో కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. యలమంచిలి నియోజకవర్గంలోని అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు, ఉపాధి కోల్పోయే బాధితులకు పరిహారం చెల్లింపు సమస్య తీర్చకుండానే, ఆ నియోజకవర్గంలోని రాంబిల్లి మండలంలో రోడ్డు విస్తరణ, భూ సేకరణ ప్రక్రియకు ఏర్పాట్లుచేయనారంభించారు. రాంబిల్లి మెయిన్ రోడ్డు నుంచి కొండవారుపాలెం, గజిరెడ్డిపాలెం, లోవపాలెం మీదుగా కావిడిమెట్ల వరకు వంద అడుగుల రోడ్డు విస్తర్ణకు చర్యలు ప్రారంభించి మరో సమస్య ముందుకుతెచ్చారు. పచ్చనిచెట్ల మధ్య ప్రశాంత జీవితం గడిపే పరిసరాలన్నీ పరిశ్రమలతో ప్రభుత్వం కలుషితం చేసింది. విషపూరిత వాయువుల మధ్య జీవనం సాగిస్తున్నవారి ఇళ్లు రోడ్డు విస్తరణలో పోతాయని తెలిసి అల్లాడిపోతున్నారు. ఇళ్లు పోతే ఎక్కడకు పోవాలి? ఎలా జీవించాలి? అనే ప్రశ్నలు వారిని సంధిస్తున్నాయి.

రోడ్డు విస్తరణ గ్రామాల్లో ఏళ్లతరబడివున్న తాగునీటిసమస్యను పట్టించుకోని వారంతా పరిశ్రమలకు వెడల్పైన రహదారుల నిర్మాణాలకు శ్రద్ధపెట్టడంపై ప్రజలు భరించలేకపోతున్నారు. పరిశ్రమలకు మరింత సదుపాయమైన రహదారుల కోసం రాంబిల్లి రోడ్డు నుంచి కొండవారుపాలెం, గజిరెడ్డిపాలెం, లోవపాలెం మీదుగా కావిడిమెట్ల వరకు తొలుత వంద అడుగుల రోడ్డు విస్తరించాలని ఎపిఐఐసి చర్యలు ప్రారంభించింది. ఈ గ్రామాల్లో రోడ్డు విస్తరణకు కొలతలు తీసింది. తొలగించాల్సిన ఇళ్లపై అధికారులు అవగాహనకు వచ్చారు. రహదారుల విస్తరణతో తమ ఇళ్లు పోతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు పోతే, ఒక్కో ఇంట్లో తలదాచుకుంటున్న మూడు, నాలుగు కుటుంబాలన్నీ ఎక్కడ ఉంటాయని కొండవారుపాలెం ఎస్సీ కాలనీకి చెందిన భూపతి అప్పలనాయుడు అన్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో తల్లీకొడుకు అరెస్ట్

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని గుమ్మకోట పంచాయితీ కంచాలగుమ్మి గ్రామంలో ఈనెల 11 తేదీన జరిగిన హత్య కేసులో తల్లి, కొడుకును అరెస్ట్ చేశామని డీఎస్పీ షెహాబాజ్ తెలిపారు హత్యకు సంబంధించిన వివరాలను అరకు సీఐ హిమగిరి, అనంతగిరి ఎస్ఐ శ్రీనివాసరావుతో ఆయన వెల్లడించారు. బింపోల్ పంచాయితీ తరమానవలస గ్రామానికి చెందిన కందుల లక్ష్మణ్‌రావుకు, గుమ్మకోట పంచాయితీ కంచాలగుమ్మి గ్రామానికి చెందిన గెమ్మల. లక్ష్మికి గత ఐదేళ్లు వివాహేతర సంబంధాలు ఉన్నాయి.. ఈనెల 11 తేదీన శుక్రవారం రాత్రి ఆమెను శారీరకంగా కలిసేందుకు కందుల లక్ష్మణ్‌రావు కంచాలగుమ్మి గ్రామానికి వెళ్లాడు. గెమ్మెల లక్ష్మిని బలవంతం చేయబోయాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అదే సమయంలో ఆమె పక్కనున్న కర్ర తీసుకొని లక్ష్మణ్ రావు తలపై బలంగా కొట్టి, పక్కనున్న రాయితో కూడా మోదింది. అక్కడితో ఆగకుండా ఆమె పెద్ద కుమారుడు గెమ్మెల లక్ష్మణ్‌రావు సాయంతో మేకలకు కట్టే కన్నెతోనే ఆయన మెడకు చుట్టి బిగించడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదేరోజు రాత్రి కిల్లో మీటర్ దూరం గుమ్మకోట సమీపంలోని తుప్పల్లో మృతదేహాన్ని పాతిపెట్టారు. కందుల లక్ష్మణ్ రావు మిస్సింగ్ పై పోలీసులకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయగా హత్య జరిగినట్టుగా గుర్తించి, బుధవారం కంచాలగుమ్మి వెళ్లి, హత్యకు పాల్పడిన తల్లి, కొడుకును అరెస్ట్ చేశారు. మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబ సభ్యులకు సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు.

నిధులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : తమ పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మండలంలోని దారెల గ్రామ పంచాయితీ సర్పంచ్ పాంగి పాండురంగస్వామి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దారెల సర్పంచ్ మాట్లాడుతూ, పెద్దపేట నుండి కుమ్మరిపుట్టు జంక్షన్ వరకు తారు రోడ్డు , గన్నేడ జంక్షన్ నుండి వనబసింగి పంచాయతీ పరిధిలోని టోంగి కోట గ్రామం కనెక్టివిటీ బీటీ రోడ్డు నిర్మించాలని కోరారు. రంగేళి సింగి గ్రామం నుండి పెద్దగూడ పంచాయతీ పనస వరకు బీటి రోడ్డు, కిలగాడ ఆర్ అండ్ బి ప్రధాన రహదారి నుండి దారెల గ్రామం రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరిందని తెలిపారు. రోడ్లను తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో దారెల క్లస్టర్ ఇన్చార్జి గడుతుల మురళి పాల్గొన్నారు .

వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్

దెబోర కుమారికి డాక్టరేట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఐఎఎస్ఇ కళాశాల విద్యా విభాగ పరిశోధక విద్యార్థిని ఇసుకపాటి దెబోర కుమారికి ఏయూ డాక్టరేట్ లభించింది. ఈ మేరకు వర్సిటీ వీసీ ఆచార్య జిపి.రాజశేఖర్ ద్వారా ఆమె బుధవారం పిహెచ్‌డి పట్టా పొందారు. 'ఇంగ్లీష్ యాజ్ ఏ మీడియం ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్ ఇన్ అప్పర్ ప్రైమరీ స్కూల్స్ ఇన్ ది డిస్ట్రిక్ట్ ఆఫ్ విశాఖపట్నం- ఎ స్టడీ' అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను దెబోర కుమారి పిహెచ్‌డి పొందారు. ఏయూ ఐఎఎస్ఇ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నగరాజకుమారి పర్యవేక్షణలో ఆమె పరిశోధనలు కొనసాగాయి. ఈ సందర్భంగా దెబోర కుమారిని విద్యా విభాగ ఆచార్యులు, పరిశోధకులు విద్యార్థులు అభినందించారు.

మారెమ్మ సన్నిధిలో అగ్ని గుండం వేడుక

గరగలతో అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు బబ్లూ

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం మారెమ్మ అమ్మవారి ఆలయంలో అగ్నిగుండం కార్యక్రమం అంగరంగ వైభవంగా బుధవారం నిర్వహించారు. ముందుగా సీలేరు నదీతీరంలో అమ్మవారి గరగ అలంకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బబులు అనే యువకుడు అగ్నిగుండం ప్రవేశం చేశారు. అనంతరం సుమారు 45 మందికి పైగా భక్తులు అగ్నిగుండం తొక్కి వారి భక్తిని చాటుకున్నారు. అగ్నిగుండం కార్యక్రమాన్ని తిలకించడానికి ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు మోతుగూడెం డొంకరాయి దారకొండ, నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి, డిఈఈ దుర్గా శ్రీనివాస్, ఏఈ సిహెచ్ సురేష్, సిఆర్పిఎఫ్ పోలీసులు, ఏపీ జెన్కో సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఒ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన

ఆర్ఒ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రమణి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒఎన్‌జిసి నిధులు రూ.10 లక్షలతో ఆర్ఓ ప్లాంట్ నిర్మాణానికి స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు, పాఠశాల హెచ్‌ఎం గోపాలకృష్ణ తదితరులు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్వో ప్లాంట్ నిర్మాణం వలన విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. పాఠశాలకు సహకారం అందించిన ఓఎన్జిసి ప్రతినిధులకు పాఠశాల కమిటీ చైర్మన్ ఎం శ్రీను, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎన్‌జిసి ప్రతినిధి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు న్యాయమూర్తుల బదిలీలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్: రాష్ట్రవ్యాప్త సీనియర్ డివిజన్ న్యాయమూర్తుల బదిలీలలో భాగంగా విశాఖపట్నంలోని పలువురు న్యాయమూర్తులకు స్థానచలనం కలిగింది. విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీగా పనిచేస్తున్న ఎంవి.శేషమ్మను గాజువాక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఆ స్థానంలో శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ప్రస్తుతం సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న ఆర్‌సన్యాసినాయుడును నియమించారు. గాజువాకలో ఇదే స్థానంలో పనిచేస్తున్న వై శ్రీలక్ష్మిని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా గాజువాక బదిలీ అయ్యారు. ఇదే స్థానంలో విధులు నిర్వహిస్తున్న ఎ.కృష్ణప్రసాద్‌ను విజయనగరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు బదిలీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 28 మంది సీనియర్ డివిజన్ న్యాయమూర్తులను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు జనరల్ రిజిస్ట్రార్ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. బదిలీ అయిన న్యాయమూర్తులు ఈనెల 30లోగా కొత్తస్థానాల్లో విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఐటిడిఏ పిఒ కట్టా సింహాచలం

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం : వివిధ ఇంజనీరింగ్ విభాగాల ద్వారా మంజూరైన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రంప చోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, ఎన్ఆర్ఇజిఎస్ ఎపిడి, ఏపీఓలు, బిఎస్ఎన్ఎల్ అధికారులతో బుధవారం పిఒ సింహాచలం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ఉపాధి హామీ ద్వారా మంజూరైన పనులు, గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. వర్షాకాలానికి ముందుగానే పనులు పూర్తి చేసే విధంగా ఇసుకకు ఇబ్బంది చూసుకోవాలనిసూచించారు. మంజూరైన బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు జూన్ నెలాఖరు నాటికి లైన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీడి జి.శ్రీనివాసరావు, ఇఇలు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, సుబ్బయ్య, మల్లికార్జున, డిఇలు చైతన్య, పి.వెంకటరమణ, సాయి సతీష్, సుబ్బారావు, శివ, మల్లికార్జునరావు, ఉమాశంకర్, శ్రీనివాసరావు, ఏఈలు, జేఈలు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల భాగస్వామ్యంతో నూతన ఆవిష్కరణలు

గీతంలో డిఎస్‌టి శాస్త్రవేత్త కృష్ణకాంత్

కృష్ణకాంత్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి-మధురవాడ: విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా ఫలితాలను మార్కెట్‌కు అనుకూలమైన నూతన ఆవిష్కరణలుగా మారాలంటే విద్యాసంస్థలు,పరిశ్రమల మధ్య బలమైన భాగస్వామ్యం, బంధం అవసరమని డిఎస్‌టి శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణకాంత్ పులిచెర్ల అన్నారు.. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎనేబ్లింగ్ సెంటర్ (జిటెక్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'క్రియేట్, ఇన్నోవేట్, ప్రొటెక్ట్ ఐపిఆర్ ఫర్ ద అకడమిక్ వరల్డ్' సదస్సులో మాట్లాడుతూ గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత దేశం 39వ స్థానంలో ఉందని, అంతర్జాతీయ పరిశోధనల పబ్లికేషన్‌లో మూడో స్థానంను దక్కించుకుందనిన్నారు. 1.59 లక్షల స్టార్టప్‌లను నెలకొల్పడం ద్వారా ఈ రంగంలో ప్రపంచంలో అగ్రస్థానంలో ఉందన్నారు. అయితే ఆవిష్కరణల ఫలితాలను ఉత్పత్తుల రూపంలో తీసుకువెళ్ళే విషయంలో వెనకబడి ఉన్నామన్నారు మార్కెట్ అవసరాలు, వినియోగదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండాసాగుతున్న పరిశోధనలే దీనికి ప్రధాన కారణమని వివరించారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు కలిసి పనిచేస్తే కొత్త సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణాత్మక ఉత్పత్తులు, సేవలు రూపుదిద్దుకోవచ్చునని, ఇది దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడతాయన్నారు. పేటెంట్‌కు దారితీసే పరిశోధనలను ప్రోత్సహించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజి (డిఎస్‌టి) పలు కార్యక్రమాలను ప్రారంభించిందని, ఇందులో ఇన్నోవేషన్‌కు ప్రోత్సహం, పేటెంట్ దాఖలుకు మద్దతు, పరిశోధనకు ఆర్థిక సాయం వంటి అంశాలున్నాయన్నారు.. గీతం డిఎస్‌టి మద్దతుతో నడుస్తున్న టెక్నాలజి ఎనేబ్లింగ్ సెంటర్ (జిటెక్) సేవలనుకొనియాడారు. " పరిశోధకులు తమ ఆవిష్కరణలను పరిశ్రమల దశల వరకు తీసుకెళ్లేందుకు జిటెక్ గొప్ప వేదికగా నిలుస్తోందన్నారు.

సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డిఎన్.రావ, . గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు జిటెక్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు జిటెక్ సలహాదారు డాక్టర్ డి.యోగేశ్వర రావు, టిసిఎస్ ఐపి సర్వీసెస్ విభాగం అధిపతి కె.సుభోద్‌కుమార్, ఐఐటి ఖరగ్‌పూర్ రాజీవ్ గాంధీ స్కూల్ ఆఫ్ లా ప్రొఫెసర్ ఎం.పద్మావతి, ఆవిడ్ ఇన్వెంట్ వ్యవస్థాపక భాగస్వామి పునీతా అరోరా, స్త్రైటెక్ పేటెంట్ ఆర్ట్ ఎగ్జిక్యూట్ ఎడ్వైజర్ శ్రీమతి ఉమాపరమేశ్వరన్, జిటెక్ అధికారులు డాక్టర్ చంద్రమౌళి, సోంభట్ శాస్త్ర, నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ టెండర్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ టెండర్ రద్దు చేయాలని పోర్ట్ యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ. డిమాండ్ చేశారు. పిపిపి పద్ధతిలో పోర్టు గోల్డెన్ జుబ్లీ ఆసుపత్రిని ప్రయివేటుకు కట్టబెట్టాలన్న ప్రభుత్వం, యాజమాన్యం చర్యలకు నిరసనగా కార్మికులు చేపడుతున్న దీక్షలు బుధవారం 198వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఏటా వందల కోట్ల రూపాయలు లాభాలు సంపాదిస్తున్న విశాఖ పోర్టు ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్యాన్ని వ్యాపారం చేయటం సమంజసం కాదన్నారు. గడచిన ఏడాదిలో విశాఖ పోర్టు రూ. 800 కోట్లు లాభాలు అర్జించిందని, జివిఎంసికి రూ.కోట్లలో పన్నులు చెల్లిస్తోందన్నారు అలాంటి పోర్టు ఆధ్వర్యంలోని ఆసుపత్రి అభివృద్ధి చేయడానికి పిపిపి విధానంలో ప్రయివేటుకు ధారాదత్త చేయడం దుర్మార్గమన్నారు. పోర్టు నిధులతోనే ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని, వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీ, అవసరమైన మందులు, అధునాతన సౌకర్యాలను సమకూర్చడం ద్వారా పోర్టు ఆసుపత్రిలో వైద్యసేవలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. విశాఖ.పోర్టు కు వేలకోట్ల విలువైన భూములతోపాటు రిజర్వ్‌ఫండ్స్‌కూడా ఉన్నాయన్నారు పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని, టెండర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో గణేష్, కెపి.శంకర్, జిసిహెచ్ నాయుడు, వివిఎన్ మూర్తి, మంగరాజు, అమరేంద్ర, బి జగన్ పాల్గొన్నారు

'కార్యకర్తలకు అండగా ఉంటాం'

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

ప్రజాశక్తి-గంగవరం : మండలంలో ఉన్న కార్యకర్తలు ఎటువంటి ఇబ్బందులు వచ్చిన వారి కష్టసుఖాల్లో అండగా ఉంటానని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో పార్టీ మండల కన్వీనర్ అప్పలరాజు అధ్యక్షతన పార్టీ మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త నాయకుడు సమిష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు ఎవరైనా అధైర్య పడవద్దన్నారు. నియోజకవర్గంలో నిరంతరం ప్రజల మధ్యలోనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

కూటమి ప్రభుత్వం బూటక మాటలకు ప్రజలు గ్రహిస్తున్నారని, రానున్న రోజుల్లో కూటమికి గుణపాఠం తప్పదని స్పష్టం చేశారు. అనంతరం వైసిపి గంగవరం మండల అధ్యక్షునిగా యజ్జు వెంకటేశ్వరరావును పార్టీ కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి జడ్పిటిసి బేబీ రత్నం, వైస్ ఎంపీపీలు గంగాదేవి రామ తులసి, పార్టీ నాయకులు వై వెంకటేశ్వరరావు, సిద్ధార్థ దొర, తాతపూడి ప్రకాష్, సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శిరీష మాట్లాడుతూ తెలుగు ఇంగ్లీష్ మీడియం చదువుతున్న ద్వితీయ ఇంటర్ విద్యార్థులు 155 మందికి పాఠ్య పుస్తకాలు అందజేశామన్నారు. ప్రథమ ఇంటర్ విద్యార్థులకు 4200 నోట్ బుక్స్ అందజేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం నర్సీపట్నంలోని షాపింగ్ కాంప్లెక్స్, సినిమా థియేటర్ల వద్ద అగ్నిమాపక అధికారి అప్పలస్వామి ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నప్పుడు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఈ నెల 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.